ప్రజాశక్తి

గురువారం 16 మార్చి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

సమస్యలు పరిష్కారమయ్యే వరకు

అంగన్‌వాడీలు పోరాడాలి

- 20న మహాధర్నాను జయప్రదం చేయండి
- ఏపి అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు అంగన్‌వాడీలు పోరాడాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న విజయవాడలో జరిగే మహాధర్నాలో ప్రకాశం జిల్లాలోని అంగన్‌వాడీలు పాల్గొని జయప్రదం చేయా లని కోరారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ముఖ్యుల సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి తెలంగాణలో కన్నా వెయ్యి రూపాయలు అదనంగా వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తెలంగాణలో 2021 నుంచి 13650 వేతనం ఇస్తున్నారని, రాష్ట్రంలో రూ.14650 ఇవ్వాలని, రూ.పది వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. అవి ప్రతినెలా ఇవ్వడం లేదని, చేసిన పనికి వేతనాలు ఇవ్వాలని కూడా పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అంగన్వాడీలతో ఖచ్చితంగా విజయవాడ నగరాన్ని ఈనెల 20న ముట్టడిస్తామని తెలియజేశారు. జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో అర్హత ఉన్న హెల్పర్స్‌కి వర్కర్స్‌గా ప్రమోషన్స్ ఇవ్వమని పదేపదే అధికారులు చుట్టూ తిరుగుతున్నా పదోన్నతులు ఇవ్వటం లేదన్నారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.కల్పన మాట్లాడుతూ మహిళా సమస్యలను ▶ 2లో



మాట్లాడుతున్న కారుసాల సుబ్బరావమ్మ

వైసిపి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

అసెంబ్లీలో గళమెత్తిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి ▶ 8లో

ఫలితాలపై ఉత్కంఠ

- నేడు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- చిత్తూరుకు బ్యాలెట్ బాక్సులు తరలింపు
- లెక్కింపు కేంద్రాలకు అభ్యర్థులు, ఏజెంట్లు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఓట్ల లెక్కింపు గురువారం నాడు చిత్తూరులో జరగనుంది. ఇందుకోసం అక్కడ యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. జిల్లాల నుంచీ బ్యాలెట్ బాక్సులను కూడా తరలించారు. మూడు పాత జిల్లాల ఓట్లు అక్కడే లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఇక ఫలితాలపై పార్టీల్లోనూ, ఉపాధ్యాయ సంఘాల్లోనూ ఉత్కంఠ కొనసాగుతోంది. పిడిఎఫ్ కూటమి అభ్యర్థులకు పోటీగా వైసిపి, తెలుగుదేశం పార్టీల నుంచి అభ్యర్థులున్నారు. దీంతో త్రిముఖ పోటీ నెలకొంది. అయితే గతం కన్నా ఈ ఎన్నికలు భిన్నంగా జరిగాయి. సాధారణ ఎన్నికల్లో జరగాల్సినవన్నీ ఈ ఎన్నికల్లోనూ కనిపించాయి. మేధావుల ఎన్నికలు అనే పదాన్ని మరిచిపోయారు. కొందరు అయ్యవార్లు అమ్ముడుపోయారనే చర్చ సామాన్యుల్లో జరుగుతోంది. గ్రాడ్యుయేట్ ఓట్లను పాలకపక్ష నేతలు కొనేశారు. ఎక్కడపడితే అక్కడ ఓటర్లకు డబ్బులు పంచారు. దీంతో పాలకపక్షం గెలుపు ధీమాలో ఉంది. తెలుగుదేశం నుంచి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతపైనే దృష్టి సారించారు. పార్టీ ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. ఇదే వీరి వ్యూహం. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. గ్రామాల్లో రెండు పార్టీల నడుమ గట్టిగానే వ్యూహాలు నడిచాయి. అయితే పాలకపక్షం డబ్బులు ఇవ్వగా తెలుగుదేశం నుంచి అక్కడక్కడా ఇచ్చారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయలేదు. దీంతో ఈ రెండు పార్టీల పరంగా చూస్తే వైసిపిలోనే ధీమా ఎక్కువగా కనిపిస్తోంది. ఇక పిడిఎఫ్ విషయానికి వస్తే వివిధ విభాగాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంటాక్టు, ఔట్‌సోర్సింగు ఉద్యోగులు, వర్కింగ్ క్లాస్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వంపై ఇటీవల పోరాటం చేసిన ఉద్యోగులు పిడిఎఫ్ కూటమికి సానుకూలంగా ఓటేశారు. రాజకీయంగా ఓట్లు చీలిపోవడంతో అంచనాలపై తర్జనభర్జన పడాల్సి ▶ 2లో



చిత్తూరులో ఓట్ల లెక్కింపునకు సిద్ధం చేసిన దృశ్యం

ఆలస్యం.. పరీక్షకు దూరం..

కన్నీటి పర్యంతమైన ఇంటర్ విద్యార్థిని



విలపిస్తున్న విద్యార్థినిని ఓదారుస్తున్న మహిళా పోలీస్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో యర్రగొండపాలెంలోని సాధన జూనియర్ కాలేజీలో పరీక్షా కేంద్రానికి మొదటి సంవత్సరం నర్సింగ్ విద్యార్థిని 20 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది. దీంతో అధికారులు పరీక్ష రాయడానికి అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ యువతి కన్నీరుమున్నీరుగా పరీక్ష కేంద్రం వద్ద విలపించింది. ఎంత బతిమిలాడినా అనుమతి ఇవ్వలేదు. దోర్నాలకు చెందిన ఆ విద్యార్థిని బస్సులో రావడంతో ఆలస్యమైందని చెప్పింది. మరో విద్యార్థిని కూడా పరీక్షకు ఆలస్యంగా రావడంతో ఆమెను కూడా పరీక్ష కేంద్రంలోకి రానివ్వకుండా అధికారులు తిప్పి పంపారు.





ఫలితాలపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

వచ్చింది. తెలుగుదేశం నుంచి రెండో ప్రాధాన్యత ఓటు పిడిఎఫ్ అభ్యర్థులకు వేశారు. కొనుగోళ్లపై బాగా దృష్టి సారించిన వైసిపి గ్రాడ్యుయేట్ తమకే దక్కుతుందనే ఆశల్లో ఉంది. చిత్తూరు జిల్లాలో దొంగ ఓట్లు కూడా చర్చకు దారితీస్తున్నాయి. ఏదేమైనా లెక్కింపు ప్రక్రియ మొదలు కానుంది. గురువారం మధ్యాహ్నం తర్వాత పరిస్థితి ఏమిటన్నదీ తేలనుంది. అభ్యర్థుల భవితవ్యం తెలియనుంది. కౌంటింగుకు అభ్యర్థులు, కౌంటింగు ఏజెంట్లు తరలివెళ్లారు. వీరికి అన్ని రకాల పాసులు జారీ చేశారు.

అంగన్‌వాడీలు పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కెవి సుబ్బమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలను కూడా 62 సంవత్సరాల వరకు రిటైర్మెంట్ గడువును పెంచాలన్నారు. పెన్షన్, గ్రాడ్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెమిమా, సిహెచ్.జ్యోతి, షర్మిల, వాణి, అంగన్వాడీలు పాల్గొన్నారు. అనంతరం ఈ నెల 20 మహాధర్నాపై ఐసిడిఎస్ పీడీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకి ధర్నా నోటీస్ ఇచ్చారు.



నాగుల చెరువును పరిశీలిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

చెరువును పూర్తి స్థాయిలో నింపాలి

వైసిపి పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త ఆమంచి

ప్రజాశక్తి, ఇంకొల్లు రూరల్

వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని ఇంకొల్లు గ్రామపంచాయతీ పరిధిలోని నాగుల చెరువును పూర్తి స్థాయిలో నింపాలని వైసిపి పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త ఆమంచి కష్ణమోహన్ తెలిపారు. నాగులచెరువును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువును పూర్తి స్థాయిలో నింపాలని అధికారులకు సూచించారు. నీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన లోపాలను పరిష్కరించే విధంగా ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఒకి సలహాలు, సూచనలు ఇచ్చారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఇంకొల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు గ్రామ సర్పంచి ఏజర్ల ప్రసన్న సైమన్ బాబు, వైసిపి మండల కన్వీనర్ బండారు ప్రభాకర్, నాయకులు మద్దినేని హనుమంత రావు, గుంటూరు శ్రీనివాసరావు, పల్లె పోగు ప్రసాద్ బాబు, చిన్ని పూర్ణరావు, రావి పేరయ్య పాల్గొన్నారు.

రైతుల జాబితాలో మార్పులు, చేర్పులుంటే

సరిచేయించుకోవాలి : ఎఓ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించిన ఇకెవైసి నమోదు వివరాలు గ్రామ రైతు భరోసా కేంద్రాలలో అందు బాటులో ఉంచినట్లు ఎఒ బాలాజీ గంగాధర్ తెలిపారు. రాంబట్లపాలెంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 17 వరకూ పంట నమోదు జాబి తాలు ఆయా గ్రామపంచాయతీ కార్యాల యాలు, రైతు భరోసా కేంద్రాలల్లో అందు బాటులో ఉంచున్నట్లు తెలిపారు. రైతులు వాటిని పరిశీలించి ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో రాంబట్లపాలెంలో గ్రామ సర్పంచి చీరాల ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయానంద్, ఎఇఒలు మాధవి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. **బల్లికురవ రూరల్ :** రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించిన ఇకెవైసి నమోదు వివరాలు గ్రామ రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు ఎఇ తెలిపారు. మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మిన్నెకంటి రామారావు ,పిఎసిఎస్ అధ్యక్షుడు దర్శి రామకష్ణయ్య , విఆర్ఒ సాయి విమల్, పంచాయతీ కార్యదర్శి జయ గాయత్రి, విఎఎ వెంకాయమ్మ పాల్గొన్నారు **కర్లపాలెం :** రబీ సీజన్‌కు సంబంధించిన ఈ పంట నమోదు జాబితా రైతు భరోసా కేంద్రాల వద్ద అందు బాటులో ఉంచినట్లు ఎఒ సుమంత్ కుమార్ తెలిపారు. పంట నమోదు జాబితాను ప్రద ర్శించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఈ పంట నమోదు జాబితా సవరణలు ఉంటే ఈనెల 20లోపు లోపల గ్రామ వ్యవసాయ సహాయకులను కలసి సరి చేయించు కోవాలని తెలిపారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

ప్రజాశక్తి-మేదరమెట్ల

ఇటీవల ఓ యువకుడు మృతి చెందాడు.అయితే యువకుడి మతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో మతదేహాన్ని బుధవారం బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు.ఈ ఘటన కొరిశపాడు మండల పరిధిలోని పమిడిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. డిప్యూటీ తహశీల్దారు రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పమిడిపాడు గ్రామానికి చెందిన బిల్లా రాజేష్ (31) గత కొన్ని నెలల క్రితం పొగాకు బ్యారెన్ పని నిమిత్తం ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామానికి వెళ్ళాడు. ఈనెల 2న రాజేష్ గుండెపోటుతో మతి చెందిన పొగాకు బ్యారెన్ రైతులు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో వారు రోళ్లపాడు వెళ్లి మతదేహాన్ని తీసుకువచ్చి ఈనెల 3న పమిడి పాడులో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే వారం రోజుల క్రితం మృతుడి భార్య అంజలి ప్రకాశం జిల్లా ఎస్పి మల్లిక గర్గ్‌ను కలిసి రాజేష్ మతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేసింది. అందులో భాగంగా మతదేహాన్ని బయటకు తీసి రాజేష్ శరీరంలోని కొన్ని భాగాలను పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్ ప్రొఫెసర్ సేకరించాడు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన రాజేష్ మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉన్నట్లు డిప్యూటీ తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటి వారిపాలెం ఎస్ఐ సుదర్శన్ యాదవ్, విఆర్ఒలు, మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట చర్యలు

బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-పర్చూరు

ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.విజయకృష్ణన్ తెలిపారు. స్థానిక బివిఆర్ అండ్ టిఎ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బాపట్ల జిల్లాలో 115 జూనియర్ కళాశాల నుంచి జూనియర్ ఇంటర్ విద్యార్థులు 8,759 మంది, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 10,474 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. బాపట్ల పరిధిలో 34 కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. పరీక్షలు సజావుగా సాగడానికి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను రెండు బందాలుగా నియమించినట్లు తెలిపారు. మరో రెండు సిట్టింగ్ స్క్వాడ్ బందాలను కూడా నియమించినట్లు తెలిపారు.క్లంబింగ్ సెంటర్లకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఓ అధికారిని స్పాట్ ఆఫీసర్‌గా ఏర్పాటు నియమించినట్లు కలెక్టర్ వివరించారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ప్రశ్నాపత్రాలు లీక్ గాకుండా భద్రతపై అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థుల వివరాలు తక్షణమే పంపాలన్నారు. విద్యార్థులు రాసిన జవాబు పత్రాలతో పాటు మిగిలిపోయిన ప్రశ్నాపత్రాలను భద్రంగా స్ట్రాంగ్ రూములకు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రశ్నాపత్రాల భద్రత, ప్రాథమిక వైద్య శిబిరం, సిబ్బంది పనితీరు, పరిసరాల పరిశుభ్రత, స్క్వాడ్ పనితీరును కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు బాగా రాయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఆర్ఐఓ కె.ఆంజనేయులు, పర్చూరు తహశీల్దారు నెహ్రూబాబు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ భవాని, ప్రిన్సిపల్ రత్నకుమారి, ఎస్ఐ చెంచు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **చీరాల :** ఇంటర్ పరీక్షా కేంద్రాలను తహశీల్దారు ప్రభాకర్‌రావు పరిశీలించారు. విజ్ఞాన భారతి, గౌతమి కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. **నాగులుప్పలపాడు :** మండల పరిధిలోని ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం జరిగాయి. మొత్తం 200 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 177 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రంగనాయకులు తెలిపారు. **కంభం రూరల్ :** ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కంభం పట్టణంలోని వాసవీ, సాధన, గౌతమి, తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కంభం సిఐ ఎం. రాజేష్ కుమార్, కంభం ఎస్ఐ వి . నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



పరీక్షా కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



మృతి చెందిన జింక

కుక్కల దాడిలో జింక మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని మొట్ల మల్లికార్జునపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కర్నూలు-గుంటూరు రోడ్డు పక్కన కుక్కల దాడిలో జింక మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు జింక మృత దేహాన్ని స్వాధీనం చేసి పంచనామ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ ప్రాంతంలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పూర్తిగా దగ్ధమైన బైకు

బైకును తగలబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

ప్రజాశక్తి- చీరాల

ఇంటి బయట పార్కింగ్ చేసిన బైకును గుర్తుతెలియని తగల పెట్టిన పెట్టిన ఘటన పట్టణంలోని 24వ వార్డు శ్రీరామ్ నగర్ బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు ఇప్పిలి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ మెడికల్ షాపులో పనులు ముగించుకొని ఇంటి వద్ద ఎప్పటిలాగే బైక్‌ను పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు బైకుపై పెట్రోల్ పోసి నిప్పటించారు. స్థానికులు గమనించి మంటను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే బైకు పూర్తిగా దగ్ధమైంది. ఈ మేరకు ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో బాధిడుతు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనగా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని సిసి కెమెరాలలోని పుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ పని ఆకతాయిలు చేశారా? లేక గిట్టని వారు ఉద్దేశపూర్వకంగా చేశారా? అనే కోణంతో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రైతులు లేకుండానే పొలంబడి

ప్రజాశక్తి-పిట్లలవాని పాలెం

మండల పరిధిలోని ఖాజీపాలెంలో పొలం బడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తప్ప ఒక్క రైతు కూడా కనిపించలేదు. జిల్లా స్థాయి అధికారి ఎం. విజయనిర్మల, ఉప్పు నీటి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్నారాణి, బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఎ. లక్ష్మి, ఎఓ సత్యానంద్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి ఎం. విజయనిర్మల మాట్లాడుతూ పొలంబడి ప్రతి ఏడాది రబీ, ఖరీఫ్ సీజన్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పొలం బడి కార్యక్రమం ద్వారా రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సి సస్యరక్షణ చర్యలు, పురుగుమందుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై ఒంగోలు డిఎస్‌పి యు. నాగరాజు బుధవారం విచారించారు. శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన దావులూరి ఆదియ్య అనే వ్యక్తి తన ఇంటి ప్రహరీ గోడను పగలగొట్టి తనపై గడ్డపారతో దాడి చేయబోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో భాగంగా ఎస్ఐ ఫిరోజా ఫాతిమా పాపిశెట్టి వెంకటేశ్వర్లు ,సంఘ వసంతయ్య హర్ష రెడ్డి , సాంబ రెడ్డి, షేక్ ఇంతియాజ్ ,షేక్ సుల్తాన్, ఎస్‌కె మున్నాపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అందులో భాగంగా డిఎస్‌పి నాగరాజు బాలాజీ నగర్‌లోని దావులూరి ఆదియ్య గృహాన్ని సందర్శించి జరిగిన విషయం గురించి అడిగి తెలుసుకున్నారు. చుట్టుపక్కల వారిని అడిగి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఫిరోజా ఫాతిమా, ఎఎస్ఐ షేక్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.



విచారణ జరుపుతున్న డిఎస్‌పి నాగరాజు



గాయపడిన మహిళ

బస్సు ఢీకొని మహిళకు గాయాలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ నుంచి ఉదయగిరి వెళుతున్న బస్సు శింగరాయకొండ బస్టాండ్ లోకి మలుపు తిరుగున్న సమయంలో శింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన వడ్డమూడి సీతమ్మ ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని 108 వాహనంలో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి. కేసు నమోదు చేసి చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి -కారంచేడు

కారంచేడు గ్రామ పంచాయతీలో రూ.85 లక్షల నిధులు దుర్వినియోగంపై చీరాల డిఎల్‌పిఒ కె.శ్రీనివాసరావు బుధవారం విచారణ చేపట్టారు 2019-2020, 2020- 2021 సంవత్సరాల కాలంలో పంచాయతీ ప్రత్యేక అధికారుల పాలనలో కారంచేడు గ్రామపంచాయతీలో సుమారు రూ. 85 లక్షల మేర నిధులు దుర్వినియోగం జరిగినట్లు ప్రస్తుత సర్పంచి బాలిక శివపార్వతి గతంలో ఆధారాలతో సహా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా మూడు సంవత్సరాల తర్వాత విచారణ చేపట్టారు. విచారణ అధికారులుగా చీరాల డిఎల్‌పిఒ కె.శ్రీనివాసరావు నూతలపాడు పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, దేశాయిపేట జూనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు,. నాగులపాలెం పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు కడవకుదురు పంచాయతీ కార్యదర్శి ఎన్.సూర్యనారాయణ ఉన్నారు.



విచారణ జరుపుతున్న అధికారులు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి చీరాల

కదిలే రైలు నుంచి ప్రమాద వశాత్తు జారిపడిన ఘటనలో ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఈపురుపాలెం-సువర్ణపురం రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. వేట పాలెం మండలం దేశాయిపేటకు చెందిన కొలుకుల బాల గంగాధరరావు (41) మంగళవారం రాత్రి సింహపురి ఎక్స్ ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు బయలు దేరాడు. ఈపురుపాలెం-స్వర్ణపురం మధ్యలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గంగాధరావును చీరాల ఏరియా వైద్యశాలకు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు బాల గంగాధరరావు

ఆటోనగర్ స్థలాన్ని పరిశీలించిన జేసీ

ప్రజాశక్తి- చీరాల

చీరాల మండలం ఈపురిపాలెం పంచాయతీ పరిధిలోని ఆటోనగర్ ఎపిఐఐసి స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, తహశీల్దారు ప్రభాకర్ రావు బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆటోనగర్ స్థలాన్ని పరిశీలించి పూర్తి నివేదికను ప్రభు త్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆటో నగర్ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ

ఇంకొల్లు విద్యార్థినికి నీట్‌లో 3700 ర్యాంకు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్



నందిని

ఇంకొల్లుకు చెందిన పేర్ని నందినికి జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పీజీ పరీక్షలో 3,700వ ర్యాంకు సాధించింది. నందిని తల్లిదండ్రులు ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నారు. అనేక మంది విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును ప్రసాదించారు. నందిని గుంటూరు మెడికల్ కళాశాలలో మెడికల్ విద్యను పూర్తి చేసింది. పీజీ పూర్తి చేసేందుకు నీట్‌లో పరీక్ష రాసిచింది. మంచి కళాశాలలో సీటు సాధించి చిన్న పిల్లల విభాగంలో పీజీ పూర్తి చేసి భవిష్యత్తులో మంచి వైద్య సేవలందిస్తానని ఈ సందర్భంగా నందిని తెలిపింది. మంచి ర్యాంకు సాధించిన నందిని ఆమె తల్లిదండ్రులు పేర్ని సత్యనారాయణ, అల్లంనేని అనంతలక్ష్మి, గ్రామ పెద్దలు అభినందించారు.



వైద్యులతో మాట్లాడుతున్న కాయకల్ప రాష్ట్ర బృందం

ఏరియా వైద్యశాలను సందర్శించిన కాయకల్ప రాష్ట్ర బృందం

ప్రజాశక్తి - చీరాల

చీరాల ఏరియా వైద్యశాలకు కాయకల్ప రాష్ట్ర బందం సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాయకల్ప రాష్ట్ర అధికారి నిర్మల గ్లోరీ, రాష్ట్ర క్వాలిటీ కన్సల్టెంట్ ప్రతినిధి డాక్టర్ శామ్యూల్, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ ప్రతినిధి కాక్టర్ ప్రశాంతి వైద్యశాలలోని ప్రతి వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పారిశుధ్య తీరు, వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, నీటి వసతి, మందులు తదిర మౌళిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వైద్యశాల్లో మరిన్ని సేవలందించటంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులిచ్చేందుకు కాయకల్ప ఉపయోగపడుతుందని చెప్పారు. ఇక్కడి పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు వారు తెలిపారు. అనంతరం వైద్యశాల సూపరింటెండెంట్, వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జివి. శేషుకుమార్, ఆర్ఎంఒ డాక్టర్ సుభాషిణి, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల జ్యోతి, హెడ్ నర్సులు మల్లీశ్వరి, బుల్లెమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో పోటీలకు పంగులూరు క్రీడాకారుడు

ప్రజాశక్తి - పంగులూరు



అట్ల శివనాగిరెడ్డి



ఖో ఖో క్రీడలో చేజింగ్ చేస్తున్న శివ నాగిరెడ్డి

అంతర్జాతీయ ఖోఖో పోటీలకు పంగులూరుకు చెందిన అట్ల శివనాగిరెడ్డి ఎంపికైనట్లు ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి 24 వరకూ అస్సాం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలో అంతర్జాతీయ ఖోఖో నాల్గవ ఏషియన్ గేమ్స్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలకు భారతదేశం జట్టు తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పంగులూరులోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీకి చెందిన అట్ల శివనాగిరెడ్డి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం శివనాగిరెడ్డి అస్సాం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలో కోచింగ్ క్యాంపులో ఉన్నట్లు ఆయన తెలిపారు. దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొనే అంతర్జాతీయ నాలుగవ ఏషియన్ గేమ్స్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌కు పంగులూరు ఎస్ఆర్ఆర్ అకాడమీ క్రీడాకారుడు ఎంపిక కావడం గర్వంగా ఉందని సీతారామిరెడ్డి తెలిపారు.

శివనాగిరెడ్డి గత పది సంవత్సరాలుగా పంగులూరులోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొంతున్నాడు. యాజల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి మరియు బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఇంకొల్లులోని డిసిఆర్ఎం డిగ్రీ కాలేజీలో డిగ్రీ, గుంటూరులో బిపిఇడి పూర్తి చేసినట్లు తెలిపాడు. ప్రస్తుతం చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

చిన్నతనం నుంచే ఖోఖో క్రీడపై ఆసక్తి ఉన్న శివ నాగిరెడ్డి పంగులూరులోని మాగుంట కాలేజీలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. శివ నాగిరెడ్డి తండ్రి రాఘవరెడ్డి ,తల్లి వెంకటేశ్వరమ్మ, వీరిది వ్యవసాయ కుటుంబం. ఖోఖో క్రీడపై ఉన్న ఆసక్తితో కుమారుడిని అప్పటి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రంగాచార్యులు సహకారంతో ఖోఖో శిక్షణ కోసం పంగులూరులోని సీతారామిరెడ్డి సహకారంతో ఎస్ఆర్ఆర్ అకాడమీలో చేర్చారు. అప్పటి నుంచి సీతారామరెడ్డి వద్ద శివనాగిరెడ్డి శిక్షణ పొంది ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. శివనాగిరెడ్డి గత పది సంవత్సరాల కాలంలో మూడుసార్లు జూనియర్ జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి సిల్వర్ మెడల్ సాధించాడు. ఆరుసార్లు సీనియర్ జాతీయస్థాయి, రెండుసార్లు జాతీయ క్రీడల్లోనూ (నేషనల్ గేమ్స్), మూడుసార్లు సౌత్ జోన్ ఖోఖో పోటీల్లో పాల్గొని బంగారు ,వెండి, కాంస్య పతకాలు సాధించాడు. 2023 జనవరిలో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్శిటీ ఖోఖో పోటీలు (జేఎన్టీయూ కాకినాడ) లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. టోర్నమెంట్‌లో శివనాగిరెడ్డి ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు. 2022 ఆగస్టులో నిర్వహించిన అల్టిమేట్ ప్రో ఖోఖో లీగ్ టోర్నమెంట్ , సోనీ టీవీ ప్రసారం చేసిన ఖోఖో పోటీల్లో చెన్నై క్విక్‌గన్స్ తరపున (కొనుగోలు చేసిన టీం) ఆడాడు. మొత్తంగా 15 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఆడాడు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరపున ఆడాడు. గత పది సంవత్సరాలలో జూనియర్, సీనియర్ స్థాయిలో బంగారు పతకాలు సాధించాడు క్రీడా పోటీల్లో ఈ స్థాయికి ఎదగటానికి తన తల్లిదండ్రులు ప్రోత్సాహం, కోచ్ సీతారామిరెడ్డి, కాశీ విశ్వనాథరెడ్డి, జె.పౌలు ఓఎల్.రెడ్డి శిక్షణ ,రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి ,పంగులూరు గ్రామ ప్రజలప్రోత్సాహం మరువలేని వని శివనాగిరెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన శివనాగిరెడ్డికి కళాశాల ప్రిన్సిపల్ రమేష్, పంగులూరు గ్రామ సర్పంచి గుడిపూడి నాగేంద్రమ్మ , జడ్‌పిటిసి రాయిని ప్రమీల, ఎంపిటిసి నూతలపాటి రాములు, రోటరీ క్లబ్ బాధ్యులు చిలుకూరు వీరరాఘవయ్య, కరణం హనుమంతరావు, టిడిపి నాయకులు రావూరి రమేష్ బాబు తదితరులు అభినందించారు.

మత్స్య సంపదను ప్రజలకు చేరువ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - చీరాల, బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అత్యధిక పోషకాలున్న మత్స్య సంపద ప్రజలకు చేరువయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె విజయ కృష్ణన్ తెలిపారు. మత్స్యశాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై సంబంధిత అధికారులతో చీరాలలోని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్య సంపదను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతంలో లభ్యమయ్యే మత్స్య సంపదను మన జిల్లా, రాష్ట్ర ప్రజలు సరిగా వినియోగించుకోవడం లేదన్నారు. అత్యధిక పోషకాలు ఉన్న మత్స్య సంపదను ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ధరలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. పొరుగు ప్రాంతాలకు మత్స్య సంపద ఎగుమతి అవుతుందన్నారు. జిల్లా ప్రజలే అధికంగా వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లాలో 70 యూనిట్లు స్థాపించాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 33 యూనిట్లు మాత్రమే ప్రారంభించడంపై కలెక్టర్ ఆరా తీశారు. మిగిలిన యూనిట్లు ఈనెల 31లోపు ప్రారంభించాలని ఆదేశించారు. సూపర్ ఫిష్ యూనిట్లు రెండు స్థాపించగా, మిగిలిన 5 యూనిట్లు త్వరగా ప్రారంభించాలన్నారు. ఫిష్ కియాస్క్ యూనిట్లు ప్రస్తుతం రెండు ప్రారంభించగా, మిగిలిన 15 యూనిట్ లు త్వరలో ఏర్పాటు చేయాలన్నారు. లైవ్ ఫిష్ ఆటో యూనిట్లు ఇప్పటికే రెండు పంపిణీ చేయగా, మిగిలిన 9 యూనిట్లు లబ్ధిదారులకు త్వరగా అందించాలన్నారు. లాంజ్ ఫిష్ యూనిట్లు మూడింటిని లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ సహాయ సంచాలకులు పి.సురేష్, మత్స్యశాఖ అభివద్ధి అధికారులు పాల్గొన్నారు.

నాటికల్లోని సందేశాన్ని ఆచరించాలి

సాంస్కృతిక శాఖ విశ్రాంత కమిషనర్ బలరామయ్య

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



కమనీయం నాటికలోని ఓ సన్నివేశం



శవరంజని నాటికలోని ఓ సన్నివేశం

శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థ,రోటరీ క్లబ్ అఫ్ మార్టూరు సౌజన్యంతో శ్రీకారం రోటరీ కళాపరిషత్ 13 వ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలలో అద్భుతమైన సందేశం ఉందని ఎపి సాంస్కృతిక శాఖ విశ్రాంత కమిషనర్, ప్రముఖ నటుడు జి.బలరామయ్య అన్నారు. శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు రెండో రోజూ బుధవారం ఆసక్తిగా సాగాయి. ఈ సందర్భంగా ఎపి సాంస్కృతిక శాఖ విశ్రాంత కమిషనర్ జి.బలరామయ్య,ప్రముఖ విశ్లేషకులు రోటరీ క్లబ్ విజయవాడ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జి.సమరం మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్న సినిమా, టీవీ సీరియల్స్ కేవలం నటన మాత్రమే ఉంటుందన్నారు. జీవితంలో జరిగే వాస్తవాలను కళ్ళకు కట్టినట్లుగా చూపడం ఒక్క నాటికల్లోనే సాధ్యపడుతుందన్నారు. 13 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతంలో శ్రీకారం రోటరీ కళాపరిషత్ ద్వారా సమాజంలో సామాజిక బాధ్యతను పెంపొందించడానికి రాష్ట్రస్థాయిలో నాటికల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎఫర్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి మోహనరావు మాట్లాడుతూ వీక్షకులు నాటికల్లో ఉన్న నీతి సందేశాలను గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి ఆధ్వర్యంలో లక్ష్మణ శాస్త్రి దర్శకత్వంలో భాస్కర చంద్ర రచించిన శవరంజని నాటిక ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసింది, అనంతరం కళావర్షిణి వీరన్నపాలెం ఆధ్వర్యంలో వైవి.చౌదరి దర్శకత్వంలో శంకర మంచి రచించిన రాజ రాజ చోరులు,శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు ఆధ్వర్యంలో బసవరాజు జయశంకర్ దర్శకత్వంలో మునిపల్లె విద్యాధర్ రచించిన కమనీయం నాటికలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీకారం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, జాష్టి అనురాధ, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కొర్రపాటి కాజారావు, కుర్రా వెంకట రామయ్య, 2023-24 రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు రావి అంకమ్మ చౌదరి,షేక్ ఖాజా హుస్సేన్, బసవరాములు, చెరుకూరి అంజిబాబు, ఎం. ఈశ్వరప్రసాద్, కందిమళ్ల రవిబాబు కంటి వైద్య నిపుణులు కొర్రపాటి సుబ్రమణ్యేశ్వరరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

నేటిక నాటికలు ఇవే...

గురువారం రాత్రి అరవింద ఆర్ట్స్ తాడేపల్లి సమర్పణలో గంగోత్రి సాయి దర్శకత్వంలో వల్లూరు శివప్రసాద్ రచించిన వెండి అంచులు, పండు క్రియేషన్స్ కొప్పోలు సమర్పణలో జి.నాగేశ్వరరావు రచించి దర్శకత్వం వహించిన పక్కింటి మొగుడు, ఉషో దయ కళానికేతన్ కట్రపాడు సమర్పణలో చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించిన ప్రక్షాళన, శ్రీకారం-రోటరీ కళాపరిషత్ కళాకారులచే ఎం.రమణయ్య దర్శకత్వంలో జాష్టి వెంకట మోహనరావు రచించిన డబ్బుకు లోకం దాసోహం కారాదు గణనాథా నాటికను ప్రదర్శించనున్నారు.



సంతాప సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉగ్ర నరసింహారెడ్డి

నేడు బొల్లా మాల్యాద్రి చౌదరి సంతాపసభ

ప్రజాశక్తి-పామూరు

మాజీ జడ్‌పిటిసి సభ్యులు, టిడిపి నాయకులు బొల్లా మాల్యాద్రి చౌదరి సంతాప సభ గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు బొల్లా నరసింహారావు తెలిపారు. బుధవారం మహలక్ష్మీ మిల్క్ డైరీ వద్ద జరిగే సభ ప్రాంగణాన్ని కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పరిశీలించారు. సంతాప సభకు జిల్లాలోని టిడిపి ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు హాజరుకానున్నట్లు తెలిపారు.



నాగయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పూర్ణచంద్రరావు

నాగయ్యకు పూర్ణచంద్రరావు నివాళి

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు చింతల వెంకట్రావు తండ్రి నాగయ్య దశదిశ కర్మకు బుధవారం నాడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు హాజరయ్యారు. నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి.రామయ్యచౌదరి, కొండపి మండలంలోని టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు

ప్రజాశక్తి-పిసిపల్లి



ఫ్లోరోసిస్ పరీక్షలు చేస్తున్న డాక్టర్

విద్యార్థులకు బుధవారం ఫ్లోరోసిస్ పరీక్షలను నిర్వహించారు. జిల్లా ఫ్లోరోసిస్ వైద్యాధికారి డాక్టర్ అనిల్ ఆధ్వర్యంలో మండలంలోని పెదఇర్లపాడు, లక్ష్మక్కపల్లి, లింగన్నపాలెం, అడివిలోపల్లిలోని ఆయా పాఠశాలలలోని విద్యార్థులకు ఉచితంగా ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించినట్లు స్థానిక ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఎ.నాగరాజ్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భైరవకోనను సందర్శించిన నెల్లూరు డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి-సిఎస్‌పురం

భైరవకోనలోని శ్రీభైరవేశ్వరస్వామి దేవస్థానాన్ని నెల్లూరు జిల్లా డిఎంహెచ్ఓ ఎం.పెంచలయ్య మరియు సిబ్బంది బుధవారం సందర్శించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఛైర్మన్ సిద్ధు రమణారెడ్డి, ఆలయ ఇఒ నర్రా నారాయణరెడ్డి సూచనల ప్రకారం అర్చక బందం ప్రత్యేక పూజలు చేసి.. ఆలయ శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్ తిరుపతయ్యకు సతీవియోగం

ప్రజాశక్తి-దర్శి



నివాళులర్పిస్తున్న నారపుశెట్టి పాపారావు

దర్శి నగర పంచాయతీలోని 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల తిరుపతయ్య సతీమణి కోటేశ్వరమ్మ(60) మంగళవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. నగర పంచా యతీలో శివరాజ్‌నగర్‌లో వారి స్వగృహంలో ఆమె మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పలువురు నాయకులు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు.

అన్నా క్యాంటీన్‌కు

దాతల సహకారం అభినందనీయం

టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

పేదల కోసం ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్‌కు పారిశ్రామికవేత్తల సహకారం అభినందనీయమని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం జనని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్‌కు టిడిపి నియోజకవర్గ నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్యామల కాశిరెడ్డి తన తండ్రి పేరు మీద స్థాపించిన శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ద్వారా లక్ష రూపాయలు విరాళం తన బావ రెడ్డెం వెంకటేశ్వర రెడ్డి ద్వారా ఉగ్ర నరసింహారెడ్డికి అంద జేశారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలనే తన ఆశయానికి దాతల సహకారం ఉండటం తనకు ధైర్యంతో పాటు, పేద ప్రజలకు సహాయం చేయాలనే తపన ఎక్కువైందని అన్నారు. శ్యామల వెంకటరెడ్డి తన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ పేదల కోసం పరితపించే వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, వెలిగండ్ల టిడిపి అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలంద్ర భూపాల్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మీనిగా కాశయ్య, మండల టిడిపి నేత సుబ్బారెడ్డి, రావూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న దృశ్యం

మద్దాలి మాధవరావుకు అత్యున్నత పురస్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి

సామాజిక కళారంగంలో విశిష్ట సేవలు చేస్తున్న ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన శ్రీ అభయ కళారాధన సాహిత్య సాంస్కృతిక సేవ సంస్థ అధ్యక్షులు డాక్టర్ మద్దాలి మాధవరావు అత్యున్నతమైన పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరిగినకవి సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా పురస్కారం అందుకున్నారు. లిటిల్ ఛాన్స్ అకాడమీ మరియు ఏపూరి బ్రదర్ ఫుడ్ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పురస్కార వేడుకల్లో ఆయనకు పద్మశ్రీ కె.విశ్వనాథ్ జీవన సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ మద్దాలి మాధవరావుకు ఘనంగా అందజేశారు. కళారంగంలో డాక్టర్ మద్దాలి మాధవరావు చేసినటువంటి సేవలకు గుర్తుగా ఆయనకు ఈ అరుదైన పురస్కారం లభించింది. డిప్యూటీ డైరెక్టర్ బి నాగార్జున, సామాజికవేత్త సూరేపల్లి రవికుమార్, ఎన్‌హెచ్ఆర్‌వో తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ బి.నాగరాజు, సినీ రచయిత ఆలూరు విల్సన్, ఇందిర ఫౌండేషన్ అధ్యక్షురాలు ఇందిర, లయన్ రజిత లహరి, సామాజికవేత్తలు సుధా ఠాకూర్, సామాజికవేత్త డాక్టర్ సామ్రాట్ గోవర్ధన్, డాక్టర్ రాధా కుసుమ, ఏపూరి బ్రదర్ హుడ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఏపూరి బాబురావు, లిటిల్ చాంప్స్ అకాడమీ అధ్యక్షులు బుచ్చేస్వరరావు, యువ సామాజికవేత్త అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ నటులు మాణిక్ తేజ మాట్లాడుతూ సమాజసేవ అనేది ఎంతో గొప్పదని, కళా రంగానికి డాక్టర్ మద్దాలి మాధవరావు చేస్తున్న కషి ప్రశంసనీయమని అన్నారు. పద్మశ్రీ కళాతపస్వి కె.విశ్వనాథ్ స్మారక పురస్కారం అందుకోవటం చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ కలలను గౌరవించాలని అప్పుడే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. సమాజసేవ బాధ్యతతో కూడుకున్నదని, అటువంటి వాటికోసం చేస్తున్న ప్రయత్నం ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం ఇవ్వాలని అన్నారు. పురస్కారం, ఆదేవిధంగా సామాజిక రంగంలో రామకష్ణ పరమహంస స్మారక పురస్కారాన్ని అతిథులు డాక్టర్ మద్దాలి మాధవరావుకు ఘనంగా అందజేశారు. జాతీయ విశిష్ట కళా భూషణ్ బిరుదుతో మద్దాలి మాధవరావును సత్కరించారు.



మాధవరావును సత్కరిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని వెలుగొండ పుణ్యక్షేత్రంలో జరుగుతున్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర స్థాయి వృషభరాజుల పోటీలను మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసులరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ పోటీలు మేకలవారిపల్లి రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ వెలుగొండ పుణ్యక్షేత్రంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు పండ్ల విభాగం నుండి ఆరు జతలు పోటీల్లో పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయచౌదరి, పల్నాడు జిల్లా అబ్బురు గ్రామం సత్తెనపల్లికి చెందిన నక్కా బలరామకృష్ణల జత 4200 అడుగులు దూరం లాగాయి. వైఎస్ఆర్ జిల్లా దాసరిపల్లె గ్రామానికి చెందిన శీలం రమేష్, మొలకల వీరన్న ఎడ్ల జత 3888.2అడుగుల దూరం లాగాయి. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం తిప్పాయపాలెం గ్రామానికి చెందిన సింగారెడ్డి శ్రీనివాసరెడ్డి, అంబారపు రామోజి ఎడ్ల జత 3285.6అడుగుల దూరం లాగాయి. వైఎస్ఆర్ జిల్లా కలసపాడు మండలం మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య ఎడ్ల జత 3241.5 అడుగుల దూరం లాగాయి. రెఫర్‌లుగా కె.వెంకటరామిరెడ్డి, ఎల్‌ఐసి వెంకటరెడ్డి వ్యవహరించారు.



పోటీలలో పాల్గొన్న వృషభరాజులు

పొగాకు సరాసరి ధర రూ.197.95

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారంతో మొదటి రౌండ్ కొనుగోళ్లు ముగిశాయి. మొదటి రౌండ్ కొనుగోళ్లు ముగిసే నాటికి సరాసరి ధర రూ.197.95, బ్రైట్ రకం సరాసరి ధర రూ.198.29, మీడియం రకం సరాసరి ధర రూ.194.86 పలికిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు. ఇప్పటివరకు 0.12 మిలియన్ల పొగాకు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. బుధవారం నాడు వేలం కేంద్రానికి చినవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 970 బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 853 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 117 బేళ్లు వివిధ కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.190, సరాసరి ధర రూ.198.02 పలికింది.

విఎఓల కాలపరిమితి జీవోను రద్దు చేయాలి

ప్రజాశక్తి-పొదిలి

విఓఎలకు కాలపరిమితి జీవోని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పొదిలి మండలంలోని వి.ఓ.ఎ.లు మండల ఏపిఎంకి బుధవారం వినతిపత్రం అందజేశారు. వి.ఓ.ఎ.ల ఉద్యోగ భద్రతకు ముప్పుగా ఉన్న మూడు సంవత్సరాల కాలపరిమితి జీ.వో.ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అన్నారు. వి.ఓ.ఎ.లందరికీ హెచ్.ఆర్.పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొదిలి మండల సంఘం కార్యదర్శి ఎస్‌కె.నాస్మా, కోశాధికారి డి.మహేష్, ఇందిరమ్మ, కపారావు, వసంత, ప్రమీల, యస్దాని, షకీల పాల్గొన్నారు.

నేడు వెలుగొండస్వామి తిరునాళ్ల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గార్లదిన్నె పంచాయతీ, వెలుగొండలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి తిరునాళ్ల గురువారం జరగనుంది. వెలుగొండ క్షేత్రం ముస్తాబైంది. పాల్గుణ శుద్ధ త్రయోదశి నుండి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం గజోత్సవము తిరునాళ్ల సందర్భంగా ఇఒ చెన్నకేశవరెడ్డి, ఆలయ ఛైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు అన్నదానం చేయనున్నారు. రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు వేల సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది. పొదిలి, మార్కాపురం, కనిగిరి డిపోల నుండి తిరునాళ్లకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. దర్శి డిఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

18న బహిరంగ వేలంపాట

ప్రజాశక్తి-చీమకుర్తి

రామతీర్థం గంగజాతర సందర్భంగా కొబ్బరి కాయలు, పూజా వస్తువులు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కులకు ఈ నెల 18న వేలంపాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఏబి.భాస్కరరెడ్డి తెలిపారు. వేలంపాటలు 18న ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంపాటలు పాల్గొని వారు వివరాలకు ఆలయ కార్యనిర్వహణ అధికారిని సంప్రదించాలని కోరారు.



వధువును ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

వధువుకు బూచేపల్లి ఆశీర్వాదం

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం, బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పోలంరెడ్డి సుబ్బారెడ్డి, బాలకోటమ్మల కుమార్తె మల్లికారెడ్డి వివాహ వేడుకకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై.. వధువును ఆశీర్వదించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆ గ్రామ నాయకులు సూరారెడ్డి, అంజిరెడ్డి, సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలి..

ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు నరసింగరావు

ప్రజాశక్తి-మార్కాపురం

రానున్న పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని.. లేని పక్షంలో మద్దతు పలకని అధికార రాజకీయ పార్టీల నాయకులను మాదిగ పల్లెల్లో తిరగనివ్వబోమంటూ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగరావు హెచ్చరించారు. వర్గీకరణ కోరుతూ చేపట్టిన 'మాదిగల సంగ్రామ పాదయాత్ర' యర్రగొండపాలెంలో ప్రారంభమై... బుధవారం మార్కాపురం చేరకుంది. ఈ సందర్భంగా జలదంకి నరసింగరావు మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో బిజెపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఏప్రిల్ 4న అమరావతి, హైదరాబాద్‌లోని బిజెపి కార్యాలయాలను మాదిగలతో ముట్టడిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. మార్కాపురంలో అడుగుపెట్టిన పాదయాత్ర బృందానికి ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు పందీటి కాశీరావు మాదిగ పూలమాలలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్వీనర్ ఆదిమూలపు ప్రకాష్, జిల్లా ఎంఎస్‌పి కన్వీనర్ తొరటి ఆనంద్ మాదిగ, సీనియర్ నేతలు వర్ల దేవదాసు మాదిగ, రావినూతల కోటయ్య మాదిగ, ఏసు మాదిగ, జేపి రాజు మాదిగ, కిరణ్ మాదిగ, ఆదిమూలుపు ఏసుదాసు మాదిగ, బాబు మాదిగ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా తెచ్చేది 'కాంగ్రెస్సే'..

పిసిసి సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-పామూరు

ఆంధ్ర రాష్ట్ర అభివద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యమని, ప్రత్యేకహోదా ఆంధ్ర రాష్ట్రానికి రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవ్వాలని పిసిసి సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు. అప్పుడు ఖచ్చితంగా ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు.

రెగ్యులర్ ఎంఈవో లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలానికి రెగ్యులర్ ఎంఈవో లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సామ్యూల్ జాన్‌ను పుల్లలచెరువు మండలం ఇన్‌ఛార్జి ఎంఈవోగా నియమించారు. దీంతో ఆయన ఎప్పుడు, ఎక్కడ ఉంటాడో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలపై ఆయన పర్యవేక్షణ కరువైంది. దీంతో పాఠశాలలు ఎన్ని గంటలకు ప్రారంభించి, ఎప్పుడు మూస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆయన తనిఖీలన్నీ మహిళా టీచర్లు ఉన్న పాఠశాలలకే పరిమితమయ్యాయి. దీంతో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులకు సంబంధించి సమస్య పరిష్కారం కావాలన్నా మాముళ్లు ముట్టజెప్పాల్సిందేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఏ పాఠశాలకు పనికి రాని కోడిగుడ్లే పుల్లలచెరువు మండలంలో సరఫరా జరుగుతుంది. నాణ్యతలేని, నాసిరకం, చిన్నసైజు కోడిగుడ్లే పుల్లలచెరువు మండలంలోని పాఠశాలలకు పంపిణీ జరుగుతుంది. ఎంఈవో కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని ఉపాధ్యాయులు బహిరంగంగానే చెబుతున్నారు. జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఒక పార్టీకి కొమ్ము కాస్తూ ఉపాధ్యాయులపై పెత్తనం చెలాయించినట్లు విమర్శలు కలవు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని మండలానికి రెగ్యులర్ ఎంఈవోను ఏర్పాటు చేసి విద్యాశాఖను గాడిలో పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టిడిపి నాయకులపై

కేసులు బనాయించటం దుర్మార్గం

టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి నాయకులు దామచర్ల జనార్ధన్‌తో పాటు పలువురు నాయకులపై కేసులు బనాయించేలా అధికార పక్షం వ్యవహరించటం దుర్మార్గమని కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. మైనారిటీసెల్ అధ్యక్షులు వకాలాన ముస్తాక్ పిలుపు మేరకు అమరావతి గ్రౌండ్‌లో మైనారిటీ సెల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ముస్లిం మైనారిటీల కోసం రూ.22 వేల కోట్లు ఖర్చుచేశామని సిఎం ప్రకటించటం సరికాదన్నారు. టిడిపి హయాంలో ఉన్న ముస్లిం పథకాలను వైసీపీ రద్దు చేసి.. ఇబ్బందులకు గురిచేటం సరికాదని, ముస్లిములు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. హజ్‌హౌస్ నిర్మాణాలను నిర్వీర్యం చేసిన ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సయ్యద్ కార్పొరేషన్ ఏర్పాటు, వక్ఫ్ భూముల పరిరక్షణకు కమిటీలు వేస్తామని బూటకపు మాటలు సిఎం చెప్పటం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీసెల్ నాయకులు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన నో బిడ్లు..

పొగాకు గిట్టుబాటు ధర తగ్గడంపై రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు బోర్డు వద్ద నిర్వహించిన వేలంలో బయ్యర్లు తిరస్కరించిన పొగాకు బేళ్లలో గతంతో పోల్చుకుంటే నో బిడ్ల సంఖ్య బుధవారం స్వల్పంగా తగ్గింది. బోర్డు ప్రారంభమైనప్పటి నుండి తొలిరోజు మినహా మిగతా అన్ని రోజులు దాదాపు 100 బేళ్లకు పైగానే వేలంలో బయ్యర్లు తిరస్కరిస్తుండడంతో వాటిని ఇంటికి తీసుకెళ్లి మళ్లీ వేలం కేంద్రానికి తీసుకురావడం రైతులకు పెద్ద ప్రహసనంగా మారింది. బుధవారం నిర్వహించిన వేలంలో బోర్డు పరిధిలోని ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, పాలేటిపాడు గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 846 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వీటిలో బయ్యర్లు 782 బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 64 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. బయ్యర్లు నాణ్యమైన పొగాకును కూడా గతం



వేలంలో పొగాకు నాణ్యతను పరిశీలిస్తున్న బయ్యర్లు, అధికారులు

కంటే తగ్గించి కిలో రూ.170 లకు కొనుగోలు చేయడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రైతులు పడిన కష్టానికి రూ.170 తో ఫలితం ఏముంటుందని ప్రశ్నిస్తున్నారు. పొగాకు సాగులో ప్రతి ఏటా ఖర్చులు అంతకంతకు పెరిగి భారమవుతుండగా బయర్లు పొగాకు ధరలను తగ్గిస్తుండడంతో రైతులలో ఆందోళన నెలకొంది. బోర్డు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గిట్టుబాటు ధర ఇచ్చి పొగాకు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా బుధవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.170గా నమోదయినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, రైతు నాయకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వివి రమణయ్య

ఒత్తిడి లేని విద్యతో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-కనిగిరి

ఒత్తిడి లేని విద్య ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కనిగిరి ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వివి రమణయ్య, ఎస్ఎంసీ చైర్మన్ గోపిశెట్టి బాలచెన్నారావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కనిగిరి ఏపి మోడల్ స్కూల్‌లో పదోతరగతి విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులతో తల్లితండ్రులు స్నేహితులుగా మెలిగి.. వారి మానసిక స్థితిని ఉత్తేజపరిచేలా వ్యవహరించాలని సూచించారు. ర్యాంకుల కోసం కాకుండా సబ్జెక్ట్‌పరంగా ఉన్నతి సాధించేలా సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, రవి, సతీష్, నారాయణ పాల్గొన్నారు.



పంటల వివరాలను తెలుపుతున్న వ్యవసాయాధికారి

రబీ పంటల సాగుపై సామాజిక తనిఖీ

వ్యవసాయాధికారి జైనులాబ్దిన్

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని 32 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 17 రైతు భరోసా కేంద్రాలలో రబీ సీజన్‌లో 2022-23 సంవత్సరానికి గానూ 3,660 మంది రైతులు 10,132.49 ఎకరాలలో వివిధ పంటలు సాగుపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్‌కె.జైనులాబ్దిన్ అన్నారు. బుధవారం మల్లవం గ్రామ సచివాలయం పరిధిలోని రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు వేసిన ప్రధాన పంటల్లో బొబ్బర్లు 6338 ఎకరాలు, మినుము 1135 ఎకరాలు, శనగ 329.3, పొగాకు 1590, వరి 392 వరి పంటలు సాగు చేయగా వాటికి సంబంధించి పంటలకు ఈ-పంట నమోదు మరియు రైతుల ఇకేవైసి ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. పంట నమోదు చేసిన రైతుల వివరాలను సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారితో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 222 మంది హాజరు

ప్రజాశక్తి-టంగుటూరు

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుండి ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదులలో పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షకు 229 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 222 మంది హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డివి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేందుకు హాజరైన విద్యార్థులందరినీ పరీక్షా కేంద్రమైన జూనియర్ కళాశాల ప్రధాన గేటు వద్దనే క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాలులోకి అనుమతించారు. టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుళ్లు వెంకట్రావు, ఖాదర్ తదితరులు పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

శింగరాయకొండ: శింగరాయకొండలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, గురుకుల పాఠశాలలో బుధవారం



అనారోగ్యం కారణంగా శింగరాయకొండలో పోలీసుల సాయంతో పరీక్ష హాలు మెట్లెక్కుతున్న విద్యార్థిని

ప్రశాంతంగా మొదలయ్యాయి. గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 253 మంది పరీక్ష రాయాల్సి ఉండగా వారు 27 మంది పరీక్షకు హాజరుకాలేదు. గురుకుల పాఠశాలలో 201 మంది పరీక్ష రాయాల్సి ఉండగా వారిలో 14 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఓ విద్యార్థిని ఆరోగ్యం బాగా లేకపోయినా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష హాలు వద్దకు స్ట్రక్చర్ సాయంతో వచ్చారు. పోలీసుల సాయంతో మెట్లు ఎక్కి పరీక్ష రాశారు. చీఫ్ సూపరింటెండెంట్ రాధారాణి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ టి.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఇనకొల్లు శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పొదిలి: పొదిలిలో ఇంటర్ మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్సై మల్లికార్జునరావు పర్యవేక్షణలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ వివేకానంద, శ్రీవీరిశెట్టి జూనియర్ కాలేజిల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

మార్కాపురం: మార్కాపురంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజున ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి. మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్, సిఐ ఎం.భీమానాయక్‌ల పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కారంచేడు

జగనన్న భూరక్ష రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్ తెలిపారు. కారంచేడు మండలంలో కలెక్టర్ బుధవారం విస్తతంగా పర్యటించారు. ఈయ సందర్భంగా రీసర్వే ప్రక్రియ, గ్రామ సచివాలయం, హోమియోపతి వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న భూరక్ష రీ సర్వేలో భాగంగా మండల పరిధిలోని కేశవరప్పాడు గ్రామంలో హద్దురాళ్ల ఏర్పాటు ప్రక్రియను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ సర్వే ప్రక్రియ ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. కేశవరపాడు గ్రామంలో 869.7 ఎకరాల భూములు ఉండగా సర్వే అనంతరం 895 హద్దురాళ్ళు వేయాల్సి ఉందన్నారు. రైతు గడ్డం శ్రీలత కు చెందిన 2.40 ఎకరాల భూమిలో మిర్చి పంట సాగు చేస్తుండగా, సర్వే పూర్తికాగానే హద్దురాళ్ళు వేయడాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం మిర్చి పంట సాగు చేస్తున్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. శాటిలైట్ ఆధారంగా భూముల హద్దులు నిర్ణయించే ప్రక్రియ, హద్దురాళ్లు వేసే కార్యక్రమాన్ని కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. సిబ్బంది పలు సూచనలు చేశారు.


సచివాలంలో పరిశీలిస్తున్న బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్

సచివాయంలో తనిఖీ

పంచాయతీల ఆదాయ వనరులను మరింతగా పెంచుకోవాలని కలెక్టర్ విజయకష్ణన్ తెలిపారు. స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ప్రభుత్వ సేవలకు చెందిన వివిధ దస్త్రాలను పరిశీలించారు. పంచాయతీ అభివద్ధి పనులపై ప్రతిపాదనలు, తీర్మానాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. నిధుల రాబడి, వినియోగం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్నులు త్వరగా వసూలు చేయాలన్నారు. గతేడాది రూ.72 లక్షల నిధులు పంచాయతీకి విడుదలైనప్పటికీ అభివద్ధి పనులు చేపట్టక పోవడంపై కలెక్టర్ ఆరా తీశారు.

హోమియో వైద్యశాలలో తనిఖీ

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. స్థానిక హోమియో వైద్యశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశాలలోని మందులను పరిశీలించారు. రెండేళ్ల క్రితం కాలం చెల్లిన మందులు ఉండటం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం కోసం వచ్చిన రోగాలకు ఎలాంటి మందులు ఇస్తున్నారని ఆరా తీశారు. కాలం చెల్లిన మందులు తక్షణమే పారవేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యమ్రంలో సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, తహాశీల్దారు వెంకటరత్నం, ఎంపిడిఒ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి- అద్దంకి

విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అద్దంకి సిఐ రోశయ్య తెలిపారు. శింగరకొండలోని కెఆర్‌కె డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే వారికి ఉజ్వల భవిషత్తు ఉంటుందన్నారు. విద్యాసంస్థల్లో అల్లుకు పోతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చి దిద్దే చర్యలలో భాగంగా బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎస్‌పిలు సంయుక్తంగా సంకల్పం- డ్రగ్స్ కు వ్యతిరేకంగా సంకల్పం కార్యక్రానికి శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, చట్ట పరమైన చర్యలు, శిక్షలు, డ్రగ్స్ వ్యసనం నుంచి ఎలా బయటపడాలి తదితర అంశాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డ్రగ్స్‌కు నిర్మూలనకు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ రోశయ్య

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - నిజాంపట్నం

నిజాంపట్నం గ్రామానికి చెందిన నాయుడు భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన చెన్ను నాగేశ్వరరావు, లంకె వెంకటేశ్వర్లు అకాల మృతి చెందారు. బాధిత కుటుంబాలను ఎంపిపి మోపిదేవి హరినాథ్ బాబు, జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య, వైస్ ఎంపిపి ఉన్నవ చంటి, ఎంపిటిసి నాజర్ ఖాన్, బోటు యూనియన్ ప్రెసిడెంట్ కన్నా శ్రీనివాసరావు తదితరులు బుధవారం పం మర్శిం చారు. తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్ప టల్ చైర్మన్ నాయుడు వెంకటేశ్వర రావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

128 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని నందిపాడు, రాచవారి పాలెం గ్రామాల రైతులు వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రానికి 934 పొగాకు బేళ్లు బుధవారం అమ్మకానికి వచ్చాయి. అందులో 806 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 128 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.190, సరాసరి రూ.195.57 పైసలు పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణధికారి శ్రీనివాస్ తెలిపారు.

కాన్షీరాంకు ఘన నివాళి

ప్రజాశక్తి- రేపల్లె

బహుజనులకు రాజ్యాధికారం తీసుకురావడానికి మాన్యశ్రీ కాన్షీరామ్ సంకల్పించిన పోరాటం స్ఫూర్తిదాయకమని జై భీమ్ భారత పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు తెలిపారు. కాన్షీరాం 81వ జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లఅర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అంబేద్కర్, ఫూలే, సాహు మహారాజ్, నారాయణ గురువులు కలలుగన్న అట్టడుగు వర్గాల సాధికారత రాజ్యాధికారం సాధించినప్పుడే సాధ్యమని గ్రహించిన కాన్షీరాం దేశవ్యాప్తంగా పర్యటించి బహుజన ప్రజలను సమీకరించి దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో నాలుగు పర్యాయాలు మాయావతిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చో బెట్టిన దీశాలి అని కొనియాడారు. జై భీమ్ భారత్ పార్టీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్, న్యాయవాది దోవా రమేష్ రాంజీ మాట్లాడుతూ దేశ జనాభాలో 80 శాతం ఉన్నటువంటి బహుజన వర్గాలు కేవలం ఓటర్ల గానే మిగిలిపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఆవుల సాంబశివరావు, రేపల్లె మండల కన్వీనర్ కర్ర బాబూరావు, కట్టుపల్లి రాజ భూషణం, గంజి పరిశుద్ధ రావు, కారుమంచి ఆశీర్వాదం, భోయన ఉయ్యూరు, యార్లగడ్డ శ్రీనివాసరావు, బసవరాజు, జయప్రసాద్ పాల్గొన్నారు. **భట్టిప్రోలు :** బిఎస్‌పి వ్యవ స్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం 89 వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బిఎస్‌పి వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జడా రవీంద్ర మాట్లాడుతూ అంబేద్కర్ వారసుడిగా ఎస్‌సి, ఎస్‌టి,బిసి ,మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారం కావాలనే దక్పథంతో కాన్సీరాం బిఎస్‌పి పార్టీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మణిక్యరావు. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

టిబి వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-వేటపాలెం

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేటపాలెం -2 వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్‌లో హెల్త్ మేళా, టిబి ముక్త భారత్ కార్యక్రమం బుధ వారం నిర్వ హించారు. ఈ సందర్భంగా స్థానిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దేవరపల్లి శిరోరాణి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, కళ్ళలో రక్తం పడడం, ఊపిరి తీసుకోవడం ఇబ్బంది, అలసట, బరువు తగ్గిపోవడం, రాత్రి సమయాల్లో జ్వరం చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు టిబి (క్షయ) వ్యాధి ముఖ్య లక్షణాలన్నారు. ఇలాంటి లక్షణాలు వారు వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. కళ్ళే పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారని తెలిపారు. హెల్త్ సెంటర్‌లో ఆరు నెలలపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. టిబి వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం విజయలక్ష్మి, ఎంపిహెచ్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- బాపట్ల

వినియోగదారుల హక్కులకు నూతన చట్టం మరింత పదను పెడు తుందని బాపట్ల ఆహార విజ్ఞాన కళాశాల ఇన్‌ఛార్జి ఏడీ సిహెచ్.వివి సత్యనారాయణ తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆహార విజ్ఞాన కళాశాలలో వినియోగదారులు నూతన చట్టానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆన్‌లైన్ లావాదేవీలు వినియోగదారులు నూతన చట్ట పరిధిలోకి వచ్చాయన్నారు. తప్పుదారి పట్టించే వ్యాపార ప్రకటన కర్తలపై చట్టం కొరడా ఝుళిపింస్తుందన్నారు. వస్తు నాణ్యతలో తేడా వస్తే ఉత్పత్తిదారులతో పాటు విక్రయ దారులని సైతం బాధ్యులుగా చేస్తారని తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పిసి.సాయిబాబు, అధ్యాపకులు విమల, సోమేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పాత కలపకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - అమృతలూరు

అమృతలూరు మండలం కూచిపూడి గ్రామంలో శ్రీకోగంటి రామస్వామి ట్రస్ట్‌కు సంబంధించిన పాతకలపకు గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ కార్యనిర్వహణాధికారి బి. శ్యామసుందరబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలోవేలం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ. 10 వేల ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దేవాదాయ శాఖ షరతులకు లోబడి మాత్రమే వేలం పాట నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు ట్రస్ట్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విజ్ఞాన బడిపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

పశు విజ్ఞాన బడి పై పశుపోషకులకు అవగాహన కల్పిస్తున్నట్లు రేపల్లె ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి. నరేంద్ర బాబు తెలిపారు. మండల పరిధిలోని గుడికాయలంక రైతుభరోసా కేంద్రం వద్ద ఉచిత పశుపశువైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలన్నారు.అనంతరం పశుపోషకులకు ఉచితంగా మందులు, మినరల్ మిక్సర్ దాణా, కాల్షియం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి ఉయ్యూరు లక్ష్మి శ్రీనివాసరావు, పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, మీనాక్షి దేవి , బి. జగదీష్ కుమార్, కరీముల్లా, వాసు, రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

భట్టిప్రోలు : మండల పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బొజ్జా నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అందులో భాగంగా మాజీమంత్రి నక్కా ఆనందబాబు పరామర్శించి మృతుడి కుటుంబసభ్యులను బుధవారం పరామర్శించారు. నాగేశ్వరావు మృతికి గల కారణాల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని మృతుడి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో అశ్రద్ధ వహిస్తే కఠినచర్యలు

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఏమాత్రం అశ్రద్ధ చూపినా బాధ్యులపై కఠినచర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఒంగోలు నగరంలోని కోర్టు సెంటర్ సమీపంలో ఉన్న నారాయణ జూనియర్ కాలేజీలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు, వారికి కల్పించిన సదుపాయాలపై ఆరా తీశారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. పరీక్షల నిర్వహణతో సంబంధం లేని వారు ఈ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా గేట్లు వేయాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఇతర సిబ్బంది ఎవరినీ సెల్‌ఫోన్స్‌తో అనుమతించరాదన్నారు. జిల్లాలో నాలుగు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. తొలిరోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్షలు ముగిశాయని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆర్ఐఒ ఎ. సైమన్ విక్టర్ ఉన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల తొలి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. జిల్లా ఎస్‌పి మలికా గార్గ్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. వేసవి కాలం దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం 29.415 మంది విద్యార్థులను కేటాయించగా 27,507 మంది హాజరు కాగా 1906 మంది గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ విద్యార్థులు 25,829 విద్యార్థులను కేటాయించగా 24,466 మంది హాజరుకాగా 1363 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 3584 మందిని కేటాయించగా 3041 మంది హాజరు కాగా 543 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎ. సైమన్ విక్టర్ ఆరు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. హైపవర్ కమిటీ, డిఇసి, డివిఇఒ సభ్యులు 13 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ జిల్లాలోని 35 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. తొలి రోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

కూరగాయల మార్కెట్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-దరిశి

కూరగాయల మార్కెట్‌కు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దరిశి కమిషనర్ మహేష్‌ను కోరారు. బుధవారం పొదిలి రోడ్‌లో చిన్నకాలువ సమీపాన ఉన్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూరగాయల కోసం ప్రజల అవసరాలు దృష్టిలో పెట్టుకొని మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరలో నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఆయన వెంట మద్దిశెట్టి శ్రీధర్, ఎఎంసి ఛైర్మన్ వైవి సుబ్బయ్య, తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెండో వార్డు కౌన్సిలర్ విసిరెడ్డి, నాయకులు ఎర్రయ్య, వాసుదేవరెడ్డి ఉన్నారు.

విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-చీమకుర్తి

దర్శి డివిజన్లోని మర్రిచెట్లపాలెం సెక్షన్‌లో వివిధ స్థాయి విద్యుత్ అధికారులు 40 బందాలుగా ఏర్పడి విస్తతంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 3500 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. 14 సర్వీసులు అదనపు విద్యుత్ లోడు వాడుకుంటున్నట్లు, ఒక సర్వీస్ వారు దొంగతనంగా విద్యుత్తు వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. 15 కేసులు నమోదు చేసి రూ.85 వేల అపరాధ రుసుము విధించారు. తనిఖీలలో విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తోట శ్రీనివాసరావు, దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సయ్యద్ అబ్దుల్ కరీం, డిఈలు గుర్నాథరావు, కె.పిచ్చయ్య, కె.శ్రీనివాసరావు, ఏఈ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-రేపల్లె

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, పట్టణ ఇన్స్పెక్టర్ యస్.విజయచంద్ర తెలిపారు. 'సంకల్పం' కార్యక్రమం బుధవారం రేపల్లెలోని స్థానిక అర్‌సి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

- పేదలకు విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వ విధానం
- వాస్తవాలను కప్పిపుచ్చి అనుకూల విషయాలను మాత్రమే సభ దృష్టికి తీసుకొచ్చారు
- అసెంబ్లీలో గళమెత్తిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

వైసిపి ప్రభుత్వం అసమర్థ నిర్ణయాలతో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసి, లక్షలాదిమంది పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తోందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఏలూరి బుధవారం మాట్లాడారు. పాఠశాలల విలీన ప్రక్రియతో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమయంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటి మూసివేత దిశగా చర్యలు తీసుకోవడంతో పేద విద్యార్థుల ఉన్నత చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయన్నారు. ముందుచూపు లేని ప్రభుత్వ నిర్ణయాలతో విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుందన్నారు. విద్యాశాఖకు మంత్రిగా ఉన్న సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ వాస్తవాలను కప్పిపుచ్చి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న విషయాలను మాత్రమే సభ దష్టికి తీసుకొచ్చారని ఆయన ధ్వజమెత్తారు. 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో 44,29,569 మంది విద్యార్థులు ఉంటే ఈ ఏడాది 40,31,239 మాత్రమే ఉన్నారని తెలిపారు. 2021-22 నుంచి ఇప్పటి వరకూ 4 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రైవేటుకు పాఠశాలలో చేరినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది 3,4,5 తరగతుల విద్యార్థులు 2,4,5 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సుదూర ప్రాంతాలకు చిన్నపిల్లలు వెళ్లలేక, వారిని పాఠశాలకు తీసుకువెళ్లే వారు లేక చదువులు మానిపిస్తున్నారన్నారు. కూలీనాలీ చేసుకునే పేద ప్రజలు వారిని దూర ప్రాంతాలకు పంపలేక చదువులు ఆపేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలను విలీనం పేరుతో మూసివేసి పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ విధానాలతో దూర ప్రాంతాలకు చిన్నపిల్లలు వెళ్లలేక తల్లిదండ్రులు పిల్లల చదువులను మధ్యలోనే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను పేదలందరికీ అందిస్తామని గొప్పలు చెబుతూ విలీనం పేరుతో పాఠశాలలను మూసివేయడం ఈ ప్రభుత్వానికి తగదన్నారు. ఈ రకంగా మళ్ళీ 8412 పాఠశాలలో మూసి వేసేందుకు రంగం సిద్ధం చేశారని పేర్కొన్నారు. నాడు-నేడు పేరుతో రకరకాల కార్యక్రమాలు చేస్తున్నారని గొప్పగా ప్రచారం చేసుకుంటున్న వైసిపి ప్రభుత్వం ఆచరణలో మాత్రం ఎలాంటి ఫలితం చూపించడం లేదన్నారు.



స్వశక్తి మహిళలకు రుణాలిచ్చేందుకు చర్యలు

- రూ.12,264.82 కోట్ల రుణాలు ఇవ్వాలి - జిల్లాస్థాయి బ్యాంకర్ల సమీక్షా కమిటీ ప్రతిపాదన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రుణాలను సమర్థంగా సకాలంలో చెల్లిస్తున్న స్వయం సహాయక సంఘాలకు మరింత తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.12264.82 కోట్ల రుణాలు ఇవ్వాలని జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా కమిటీ ప్రతిపాదించింది. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కమిటీ సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు రుణాల పంపిణీ తీరు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రతిపాదనలపై ఈ సమావేశంలో రంగాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. 2022-23 ఆర్థిక సంవత్సర లక్ష్యంలో 98.16 శాతం రుణ పంపిణీ చేసినట్లు ఎల్.డి.ఎం. యుగంధర్ కలెక్టర్‌కి వివరించారు. ప్రాధాన్యతా రంగంలో 102.23 శాతం, ప్రాధాన్యేతర రంగంలో 85.78 శాతం రుణాలు అందించినట్లు ఆయన వివరించారు. వ్యవసాయ రంగంలో ఖరీఫ్ కాలానికి 98.23 శాతం, రబీ కాలానికి 137 శాతం రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రాధాన్యతా రంగానికి ఆ మేరకు రుణాలు పంపిణీ చేయడాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కిసాన్ క్రెడిట్ కార్డులు (కె.సి.సి) అర్హులైన రైతులకు, పశుపోషకులకు, మత్స్యకారులకు సకాలంలో అందేలా బ్యాంకులు చురుకైనపాత్ర పోషించాలని సూచించారు. రాబోయే 2023-24 ఆర్థిక సంవత్సరంలో కూడా ఇదే స్ఫూర్తితో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ కోరారు. కాగా 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రాధాన్యతా రంగానికి 11 శాతం, వ్యవసాయ రంగానికి 12 శాతం అధిక రుణాలను 2023-24 ఆర్థిక సంవత్సరానికి మంజూరు చేయాలని ప్రతిపాదలు రూపొందించినట్లు ఎల్‌డిఎం తెలిపారు. వీటికి ఈ సమావేశం ఆమోదం తెలిపింది. సమావేశంలో ఆర్‌బిఐ ఏజిఎం అనీల్ కుమార్, నాబార్డు డిడిఎం ఎంవి రమణ, డిఆర్‌డిఏ పీడీ బాబూరావు, మెప్మా పీడీ టి.రవికుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బేబీరాణి, ఏ.పి.ఎం.ఐ.పి. పి.డి. రవీంద్ర బాబు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఉదయ్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.